ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
మంగళవారం 9 ఏప్రిల్ 2024



ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి: డీఈవో

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8: పోటీ పరీక్షల కోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లావిద్యాశాఖ అధికారి అశోక్‌అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ డీఆర్సీలో ఉచిత కోచింగ్‌సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'పది' పరీక్ష రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్, తదితర కామన్ పరీక్షలకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కటుకం మధుకర్, కోకన్వీనర్ గడ్డం భిక్షపతి, విషయ నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత మత్తు పదార్థాలు నియంత్రణకు కఠిన చర్యలు: ఐజీ



వీసీలో పాల్గొన్న ఎస్పీ, ఇతర పోలీసుల అధికారులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 8: రాష్ట్రంలో నిషేధిత మత్తుపదార్థాల నియంత్రణకు కఠినచర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లాఎస్పీ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నమోదైన గంజాయి కేసులను, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల మొక్కల పెంపకం, రవాణా, స్వీకరించడం చేసే వారిపై ప్రత్యేకనిఘా పెట్టాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

● జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 8: జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉపరి తలద్రోణి కారణంగా జిల్లాలో సోమవారం తెల్లవారు జామున ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో నిన్నటివరకు 43డిగ్రీలుగా ఉన్న ఉష్ణోగ్రతలు 39డిగ్రీలకు తగ్గాయి. దీంతో ప్రజలు కొంతఉపశమనం పొందారు. జిల్లా వ్యాప్తంగా 1.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెల్లవారుజామున ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. సిర్పూర్(యు) మండలంలో 0.6మిల్లీమీటర్లు, లింగాపూర్‌3మిల్లీమీటర్లు, ఆసిఫాబాద్‌లో5.2మిల్లీమీటర్లు,కెరమెరిలో 2.4మిల్లీమీటర్లు, వాంకిడిలో 1.0మిల్లీమీటర్లు, కాగజ్‌నగర్‌లో 1.2మిల్లీమీటర్లు, సిర్పూర్(టి)లో 3.6మిల్లీమీటర్లు, కౌటాలలో 1.2మిల్లీమీటర్లు, పెంచికలపేటలో 1.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

లింగాపూర్‌లో గాలివాన



గోపాల్‌పూర్ తండాలో గాలి వానకు నేలవాలిన జొన్న చేను

లింగాపూర్: మండలంలో ఆదివారం రాత్రి అక్కడక్కడ గాలివానతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండలకేంద్రంతోపాటు గోపాల్‌పూర్ తండా, మామిడిపల్లి, పిక్లతండా గ్రామాల్లో రైతులు జాటోత్ సుధాకర్, జాదవ్ గణేష్ రైతుల జొన్నపంట నేలవాలింది. ఒక్కొక్క రైతుకు ఐదు ఎకరాల్లో పంట నష్టం కలిగిందని తెలిపారు.

అంగన్‌వాడీలకు మంచి రోజులు



● కేంద్రాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
● నూతన భవన నిర్మాణాలకు నిధులిస్తామని సీఎం హామీ
● కేంద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాలు
● స్వాగతిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వాంకిడి, ఏప్రిల్ 8: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. కానీ వీటికి పక్కా భవనాలు లేక అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. గతనెల మహిళా శిశు సంక్షేమంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించి అంగన్ వాడీ కేంద్రాల బలోపేతం కోసం తీసుకుంటున్న పలు నిర్ణయాలు ప్రకటించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని, ఉపాధి నిధులతో అన్ని ఒకే తరహా ఉండేలా పక్కా భవనాలు నిర్మించేలా దస్త్రాలు సిద్ధం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో వ్యవస్థ బలోపేతంపై ఆశలు చిగురిస్తున్నాయి.

సొంత భవనాలు ఏర్పాటు అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కనీస వసతులు సమకూరుతాయి. ప్రస్తుతం సామాజిక, అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో కనీసవసతులు లేవు. మూత్ర శాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర సమయంలో మరుగుదొడ్డి కోసం ఇళ్లకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. చిన్నారులను చదువుబాట పట్టించేందుకు వారికి ఆటపాటలతో కూడిన విద్యనందిస్తారు. ప్రతినెలా వారిఎత్తు బరువు, ఆరోగ్య వివరాలను పరిశీలి స్తుంటారు. లోపాలు గుర్తించి సరైన ఎదుగుదలకు అవసరమైన వైద్యసేవలు అందేలా చూస్తారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తారు. ఇలా అనేక రకాల సేవలను అందించే కేంద్రాల్లో చాలా వాటికి పక్కా భవనాలు లేవు. ఉన్న వాటిలో అరకొరవసతులతో ఉన్నాయి. మరి కొన్ని శిథిలావస్థకు చేరకున్నాయి. 60 శాతానికి పైగా కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, మరుగు దొడ్లు, మూత్రశాలలు లేవు.

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్‌తో..

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు స్వాగతిస్తున్నా రు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వపరంగా ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా అంగన్‌వాడీ కార్యకర్తలే గుర్తుకువస్తారు. గ్రామసభలు నిర్వహిస్తే అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను పిలిపించి సభలను మమా అనిపిస్తున్నారు. పల్స్‌పోలియో, ర్యాలీలు, బీఎల్వో విధులు ఇలా లెక్కలేనన్ని పనులు అంగన్‌వాడీ టీచర్లకు అప్పగిస్తున్నారు. ఇవన్నీ నోటి మాట ద్వారానే జరు గుతున్నాయి. పైఅధికారుల మాటలు కాదన లేక కార్యకర్తలు వింటూనే ఉన్నారు. ఇప్పుడు సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని అమలులోకి తీసుకొస్తే అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాలను వదిలి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అంతే కాకుండా కేంద్రాల నిర్వహణలో పారదర్శకత మరింత మెరుగుపడుతుంది. అప్పుడప్పుడు బియ్యం, గుడ్లు, దారి మళ్లుతున్నాయని, పౌష్టికాహా రంలో నాణ్యత లోపిస్తోందని, సమయాపాలనతో విధులు నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు అంగన్‌వాడీ టీచర్లపై వస్తున్నాయి. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాలతో పై వాటికి చెక్‌పెట్టినట్లు అవుతుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో ఆసిఫాబాద్, వాంకిడి, జైనూర్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) అయిదు ప్రాజెక్టుల పరిధిలో 973కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 300కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 306కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా 367కేంద్రాలు పాఠశాలలు, పంచాయతీలు, ఇతర భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇందులో 821కేంద్రాలకు విద్యుత్ సదుపాయం లేదు. దీంతో రెండేళ్లక్రితం జిల్లాలోని వంద అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా మార్చారు. వీటిని ఆకట్టుకునేలా రంగులతో తీర్చిదిద్దారు. వంద కేంద్రాలకు ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు. వీటిలో 80 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం లేకపోవడంతో అవన్నీ వృథాగా మారాయి. దీంతో చిన్నారులకు చిత్రప్రదర్శన ద్వారా బోధించాలన్న ప్రభుత్వఆశయం నీరుగారి పోతోంది.



బంబారకేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఎల్‌ఈడీ టీవీ

ఐసీడీఎస్ ప్రాజెక్టులు-5
అంగన్‌వాడీ కేంద్రాలు-973
సొంత భవనాలు ఉన్నవి-300
అద్దె భవనాల్లో ఉన్నవి-306
పాఠశాలలు, పంచాయతీల్లో కొనసాగుతున్నవి-367

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు..

0 నుంచి 6ఏళ్ల పిల్లలు-49,029
బాలింతలు-4,518
గర్భిణులు-4,566
కిశోర బాలికలు-22,820

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషిచేయాలని జిల్లా ఎన్నికలఅధికారి, కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని సిర్పూర్(001), ఆసిఫాబాద్(005) శాసనసభ నియోజకవర్గాల్లో నియమించిన సెక్టార్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కార్యచరణ విడుదల అయిన తేదీ నుంచి అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఎన్నికల మొదలు నుంచి పోలింగ్ ప్రక్రియ ముగింపువరకు సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైనదన్నారు. వేసవిదృష్ట్యా అధికఉష్ణోగ్రత ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే మాక్‌పోలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రతిరెండు గంటలకు ఒకసారి పోలింగ్‌శాతాన్ని సహాయఎన్నికల అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికలప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపుకలెక్టర్‌లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారిరమాదేవి, మాస్టర్‌ట్రైనర్లు, తహసీల్దార్, సెక్టార్‌అధికారులు, ఎన్నికలవిభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి..

తిర్యాణి: ప్రజలకుఅధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. తిర్యాణి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, వైద్యసిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలందరికీ తాగునీటి సమస్య లేకుండా చూడాలని మిషన్‌భగీరథ అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. ప్రతికూలీకి ఉపాధిహామీ పథకం అందేవిధంగా సిబ్బందిచర్యలు చేపట్టాలన్నారు. ఎండాకాలంలో ప్రజలకువచ్చే ఆరోగ్యసమస్యల పట్ల వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్‌కు సూచించారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు దుస్తులను కుట్టే అవకాశాన్ని మహిళా సంఘాలకు ఇస్తామన్నారు. ఈసందర్భంగా ఆటో డ్రైవర్లు రోడ్డు బాగుచేయాలని వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఆర్ఐ బిల్డింగ్‌తోపాటు ఏఎన్ఎం సబ్ సెంటర్‌నుఆక్రమించిన వారిపైచర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, డీపీవో సుదర్శన్‌గౌడ్, డీఎల్‌పీవో సురేందర్, తహసీల్దార్ సంజుకుమార్, ఎంపీడీవోమల్లేష్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఏపీఎం సదానందం, ఏవో తిరుమలేశ్వర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 8: వేసవితాపాన్ని తట్టుకొనేందుకు జిల్లాకేంద్రంలోని వివేకానందచౌక్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కమిషనర్ భుజంగరావు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యాల సిబ్బంది సంతోష్, శంకర్ పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికుల వేతనాలు చెల్లించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 8: శ్రీరాంపూర్ డివిజన్‌లో పనిచేస్తున్న మేషన్, చిప్పింగ్ కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టువర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, శ్రీరాంపూర్‌బ్రాంచ్‌అధ్యక్షుడు దొడ్డిపట్లరవీందర్ అన్నారు. ఎస్ఆర్పీ3గనిపై సోమవారం నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరైమాట్లాడారు. మేషన్,చిప్పింగ్ కాంట్రాక్టుకార్మికులకు నాలుగునెలలకు సంబంధించిన వేతనాలు వెంటనేఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికుల నిరసన

కాసిపేట, ఏప్రిల్ 8: కాసిపేట2వ గనిలో అధికారులు కార్మికులు వేధించడాన్ని నిరసిస్తూ సోమవారం రెండోషిఫ్టులో గనిమేనేజర్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిలక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ విధానాలు మానుకోవాలన్నారు. అనంతరం గనిమేనేజర్ లక్ష్మీనారాయణ స్పందించి కార్మికులకు సమస్యలు రాకుండా చూస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

మృతిచెందిన కార్మికుడికి సంతాపం

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 8: ఆర్కేపీ ఓసీనందు శనివారం ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడు పాయం వెంకటేశ్వర్లుకు ఓసీపీ మేనేజర్లు, యూనియన్ నాయకులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు.

గోలేటి సీహెచ్‌పీలో టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు

రెబ్బెన, ఏప్రిల్ 8: బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి అంతా కృషి చేయాలని కోరారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

రెబ్బెన, ఏప్రిల్ 8: రెబ్బెన మండలం పాసిగాం గ్రామానికి చెందిన రజిత(23) అనే వివాహిత సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాసిగాం గ్రామానికి చెందిన నికోడే శంకర్, రజిత భార్యభర్తలు. వీరికి పిల్లలు పుట్టకపోవటంతో ఇద్దరిమధ్య తరుచూ గొడవలు జరిగేవి. సోమవారం మద్యం సేవించి వచ్చిన శంకర్ భార్యతో గొడవపడ్డాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన రజితఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ మేరకు రజిత తండ్రి గజానంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్: సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సోమవారం ఇన్‌చార్జి డీడబ్ల్యూవో రిబ్కాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ధనలక్ష్మి, ఉమాదేవి, సువర్ణ పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని చందుగూడలో ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు.అలాగే కేస్లాగూడలో మంచినీటిబోర్ పనులను పర్యవేక్షించారు.

-మండలంలోని పలుఆశ్రమ పాఠశాలలను సోమారం ఏసీఎంవోఉద్ధవ్ తనిఖీచేశారు. హట్టి, బాబేఝరి, పాట్రాపూర్, జోడేఘాట్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు.వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు.

దహెగాం/కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతులకల్పనపై దహెగాంలో ఎంపీడీవో రాజేందర్, కౌటాలలో జిల్లా కోఆర్డినేటర్ భరత్‌కుమార్, అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ, డీపీఎం అన్నాజీ ప్రధానోపాధ్యాయులు, ఎస్‌హెచ్‌జీ వీవోలకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లోవిద్యుత్, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్ల సమస్యలు గుర్తించి నిర్వహణ కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు.


బెజ్జూరు: రెండురోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన బీఆర్ఎస్ కార్యకర్త సిందేసీలయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్సీ దండేవిఠల్ అన్నారు. సోమవారం మండలంలోని నాగులవాయి గ్రామంలో బాధితకుటుంబాన్ని పరామర్శించారు.

పెంచికలపేట: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట కబ్జా చేసిన స్థలాన్ని సోమవారం తహసీల్దార్ వెంకటేశ్వరరావు మండలఅధికారులతో కలిసి పరిశీలించారు. ఆయనవెంట ఎంపీవోగంగాసింగ్, ఆర్ఐ గోపాల్, కార్యదర్శి చంద్రశేఖర్, పోలీసుసిబ్బంది ఉన్నారు.

చింతలమానపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు మేమున్నామని భరోసా ఇచ్చేందుకు పోలీసులు కవాతు నిర్వహించారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామంలో సోమవారం కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులుకవాతు నిర్వహించారు.


















తేనెతీగల దాడి

కాసిపేట, ఏప్రిల్ 8: బెల్లంపల్లి మండలంలోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన నలుగురిపై సోమవారం తేనెతీగలు దాడి చేశాయి. బుగ్గ ఆలయ సేవకురాలు గుండ పోసక్క తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్న భోజన సమయంలో భక్తులతో ఆలయం కిక్కిరిసి ఉంది. వంటలు చేస్తున్న సమయంలో పొగ వ్యాపించడంతో ఒక్కసారిగా తేనెతీగల గుంపు భక్తులపై దాడి చేసింది. ముగ్గురు భక్తులతోపాటు తనపై కూడా దాడి చేసినట్లు తెలిపింది. బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తాను కాసిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిపింది. ఎవరికి ప్రాణాపాయం లేదని ఆలయ కమిటీ తెలిపింది.

దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

ఏసీసీ, ఏప్రిల్ 8: దోపిడీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. సోమవారం ఏసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న రాంనగర్‌కు చెందిన బొప్పు మల్లేష్ రాత్రి మంచిర్యాల బైపాస్‌రోడ్డులో దిగాడు. ఆటో కోసం ఎదురు చూస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆటోలో ఎక్కించుకుని రంగపేట వైపు తీసుకువెళ్లారు. నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకువెళ్లి కత్తితో బెదిరించగా మరో వ్యక్తి కర్రతో దాడి చేసి మల్లేష్ వద్ద ఉన్న రూ.4 వేల నగదు, గడియారం లాక్కుని వెళ్లిపోయారు. సోమవారం రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా దండేపల్లి మండలం తాళ్లరెబ్బెన గ్రామానికి చెందిన చెన్నూరి రవిని విచారించగా నేరం ఒప్పుకున్నాడన్నారు. మరో నిందితుడు దారంగుల రాజు పరారీలో ఉన్నాడన్నారు. రవి వద్ద నుంచి ఆటో, రూ. 2 వేల నగదు, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

కాసిపేట, ఏప్రిల్ 8: మండలంలోని చిన్న ధర్మారానికి చెందిన మేరుగు రామ్మూర్తి ఇంటి ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి క్షుద్ర పూజలు చేయడం కలకలం రేపింది. రామ్మూర్తి కుటుంబీకులు మాట్లాడుతూ నెల రోజుల వ్యవధిలో ఇంటి ఎదుట మూడుసార్లు పసుపు కుంకుమ, కోడిగుడ్డు, నిమ్మకాయలతోపాటు ఇతర వస్తువులు పెట్టారని తెలిపారు. ఆదివారం రాత్రి కొబ్బరికాయకు నల్లదారం చుట్టి మేకులు దించి ఉంచడంతో భయపడ్డామన్నారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు నమ్మవద్దని, ఎవరో ఆకతాయిలు చేసిన పని అయి ఉంటుందని, గ్రామాల్లో పెట్రోలింగ్‌లు నిర్వహిస్తామన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం

దండేపల్లి, ఏప్రిల్ 8: పెద్దపేటలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు లింగంపల్లి బాపు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఉపారపు నర్సయ్య, అధ్యక్షుడిగా ముల్కల్ల నరేష్, ప్రధానకార్యదర్శిగా రత్నం తిరుపతి, కోశాధికారిగా నీరటి రాజయ్య, ఉపాధ్యక్షులుగా జంగం ధర్మయ్య, బొడ్డు వెంకటేష్, బొర్లకుంట బుచ్చి రాజం, సంయుక్త కార్యదర్శులుగా బెడుగల లచ్చయ్య, దొంతమల్ల గంగయ్య, జాడి రాజేష్, ప్రచార కార్యదర్శులుగా బెడగల లచ్చయ్య, కోడి సత్తయ్య, బొర్లకుంట రాజేష్, ప్రధాన సలహాదారులుగా జంగం భూమేష్, గంజాయిల సుధాకర్, బొడ్డు సత్తయ్యలను నియమించారు. గోళ్ల రాజమల్లు, బచ్చల అంజన్న, రాజన్న, బచ్చల సుభాష్, ఇస్తాకర్, గుమ్మడి కిరణ్‌కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాకేష్ మృతికి కారకులైన వారిని శిక్షించాలి


పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన రాకేష్ కుటుంబీకులు

జన్నారం, ఏప్రిల్ 8: మండల కేంద్రానికి చెందిన తోకల రాకేష్ కుమార్ కడెం ఇరిగేషన్ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా విధులు నిర్వహిస్తుండగా గత నెల 16న అధికారుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతికి కారణమైన అధికారులను శిక్షించాలని పోలీస్‌స్టేషన్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుడి తల్లి సరస్వతి పురుగుల మందు డబ్బాతో బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్ఐలు చంద్రకుమార్, స్వరూప్‌కుమార్‌లు మూడు రోజుల్లో దోషులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. నాయకులు దాసరి తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్వర్ మద్దతు తెలిపారు.

బీసీలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి

జైపూర్, ఏప్రిల్ 8: రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో అవకాశాలు కల్పించాలని బీసీ జిల్లా కన్వీనర్ ఒడ్డేపల్లి మనోహర్ పేర్కొన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ మేలుకో రాజ్యం ఏలుకో నినాదంతో చేపట్టిన బీసీ ప్రజా చైతన్య యాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఆయన మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టసభల్లో అవకాశం కల్పించేంత వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. నాయకులు నీరటి రాజన్న, చెలిమెల అంజయ్య, శంకర్, రాజు, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వయోజనులకు చదువు నేర్పించడం అభినందనీయం

కన్నెపల్లి, ఏప్రిల్ 8 : వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో నిరక్షరాస్యులకు చదువు నేర్పించడం అభినందనీయమని జెడ్పీ సీఈవో గణపతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి సందర్శించారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ కుట్టు శిక్షణ పట్టుదలతో నేర్చుకుని నైపుణ్యం పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. బండ శాంకరి, శారద, జనార్ధన్, అశోక్‌రావు, శిక్షకురాలు లిఖిత తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరికి గాయాలు

భీమారం, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఎండీ బాబర్‌ఖాన్, తైదల నరేందర్‌లను మంచిర్యాల నుంచి చెన్నూరు వైపు వెళ్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఇద్దరు గాయాలపాలయ్యారు. మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

ఎంపీగా గెలిపిస్తే కార్మికుల సమస్యల పరిష్కరిస్తా


కార్మికులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఈశ్వర్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 8: తనను పెద్దపల్లి ఎంపీగా గెలిపిస్తే సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం ఆయన ఎస్ఆర్‌పీ 1, 3 గనులపై నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. గతంలో తాను కార్మికుడిగా పనిచేశానని, తనకు కార్మిక సమస్యలు తెలుసని పేర్కొన్నారు. ఆదాయపు పన్ను రద్దు, గ్రాట్యుటీ, పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. రిటైర్డ్ కార్మికులకు నెలకు కనీసం రూ.10 వేలు పింఛన్ వచ్చేలా చూస్తానన్నారు. పెన్షనర్ల పక్షాన పెద్దపల్లి కోటిలింగం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఉన్న సింగరేణి కార్మికుడి విగ్రహానికి పూలమాల వేశారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, విజిత్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అక్కూరి సుబ్బయ్య, మేరుగు పవన్‌కుమార్, కౌన్సిలర్ వంగ తిరుపతి, టీబీజీకేఎస్ నాయకులు పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, పాల్గొన్నారు.

దండేపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా గెలిపిస్తే ఐదేళ్లు మీకు సేవకుడిగా పని చేస్తానని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, పార్టీ శ్రేణులతో కలిసి మ్యాదరిపేట, దండేపల్లిలో వారసంతతోపాటు ఇంటింటా కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చిందన్నారు. వందరోజుల్లో హామీలను అమలు చేస్తామని అధికారం చేపట్టి 120 రోజులు వుతున్నా నెర్చవేర్చలేదన్నారు. మూడు నెలలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విసుగు వచ్చిందని, ఇచ్చిన హామీలను నెర్చవేర్చకుండా ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ మోసం చేస్తున్నాడన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, పట్టణ అధ్యక్షుడు సత్తయ్య, రవీందర్, విజీత్‌రావు, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

అయోధ్యకు యువకుడి పాదయాత్ర


పాగిడి రవికుమార్

నెన్నెల, ఏప్రిల్ 8: మండల కేంద్రానికి చెందిన పాగిడి రవికుమార్ అనే యువకుడు ఆయోధ్యకు పాదయాత్రగా సోమవారం బయలుదేరాడు. 1050 కిలోమీటర్ల దూరంలోని ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యకు నెల రోజులపాటు నడిచి చేరుకుంటానని చెప్పాడు. మార్గమధ్యలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ నడక కొనసాగిస్తానని పేర్కొన్నాడు. రోజు 30 నుంచి 35 కిలోమీటర్లు ప్రయాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపాడు. లోక కల్యాణార్థం ఈ సాహసం చేస్తున్నానని, శ్రీరాముడు దయతో యాత్ర విజయవంతంగా పూర్తి చేస్తానన్నాడు. మండే ఎండల్లో అయోధ్య పాదయాత్ర సాహసమేనని, క్షేమంగా వెళ్ళి తిరిగి రావాలని ఆకాంక్షిస్తు గ్రామస్థులు రవికుమార్‌కు వీడ్కోలు పలికారు.

క్రీడాకారిణికి ఆర్థిక సహాయం



ఏసీసీ, ఏప్రిల్ 8: మంచిర్యాల జిల్లాలోని మాదారంకు చెందిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి సుశ్రితకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చేతుల మీదుగా రూ. 15 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వీస్‌మెన్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేద ప్రజల ఆర్థికాభివృద్ధి


నంబాలలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్,నాయకులు.

దండేపల్లి, ఏప్రిల్ 8: కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే పేద ప్రజలు ఆర్థికాభివృద్ధి చెందుతారని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘునాథ్‌లు అన్నారు. సోమవారం గూడెం, రాసపల్లి, నంబాల గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘునాథ్, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ ప్రభుత్వం రావాలన్నారు పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు రాజయ్య, సురేందర్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గురువయ్య, గూడెం పీఏసీఎస్ చైర్మన్ సురేష్, నాయకులు కిషన్, ప్రభాకర్, హరికృష్ణ, రవిగౌడ్, గిరిధర్, ప్రశాంత్, శ్రీనివాస్, గంగన్న, సత్యం, తులసి, మహేష్, లక్ష్మినారాయణ, పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో సోమవారం బీజేపీ నాయకులు, ప్రో నమో టీం సభ్యులు ప్రచారం నిర్వహించారు. పట్టణాధ్యక్షురాలు దార కళ్యాణి ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ నినాదాలు చేస్తూ ప్రచారం చేశారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, ఉపాధ్యక్షులు పులుగం తిరుపతి, బాపు, సంతోష్‌కుమార్, రాజులాల్ యాదవ్, రాంచందర్, యుగందర్, సుమ, స్రవంతి, వెంకటేష్, స్వామి, రాములు, సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


పైపులైన్ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోటపల్లి, ఏప్రిల్ 8 : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం పారుపెల్లి, ఏదులబంధం గ్రామాల్లో పర్యటించిన ఆయన మిషన్ భగీరథ పైపులైన్, పారిశుధ్య పనులను పరిశీలించారు. పైపులైన్‌లలో లీకేజీలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పనులను పూర్తి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి ఎద్దడి తలెత్తితే వ్యవసాయ బోర్ల నుంచి గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. ప్రత్యేకాధికారులు రోజు గ్రామాల్లో పర్యటించి పర్యవేక్షణ జరపాలన్నారు. ఎంపీడీవో ఆకుల భూమన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బద్రినాథ్ స్వామి,మిషన్ భగీరథ ఏఈ వివేక్, తదితరులు ఉన్నారు.

భీమిని: తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో గంగామోహన్ అన్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మూడు మాసాలు అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పనులు ప్రతీ ఒక్క జాబ్‌కార్డు కూలీలకు కల్పించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి ఏడి మైన్స్ జగన్మోహన్ రెడ్డి, ఏపీఓలు సఫ్దర్ అలీ, శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పోశం, శ్రీకాంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలం


సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

జైపూర్, ఏప్రిల్ 8: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేష్ పేర్కొన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. కాంగ్రెస్ చేరే నాయకులు మధ్యలో బీఆర్ఎస్‌లోకి వచ్చినవారేనని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ఉన్న నాయకులందరం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరే వారితో బీఆర్ఎస్ పార్టీకి నష్టం లేదన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆధ్వర్యంలో పనిచేస్తామన్నారు. నాయకులు పాలమాకుల సురేందర్‌రెడ్డి, మేడి తిరుపతి, ఎంపీటీసీ బడుగు రవి, ఆర్నె సమ్మయ్య, ఆయా గ్రామాల సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 8: రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ఆలిండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర కార్యదర్శి సతీష్‌లు పేర్కొన్నారు. సోమవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో 350కి పైగా సీట్లు సాధిస్తే రాజ్యాంగ సవరణ చేయడానికి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారన్నారు. ఒక వేళ అదే జరిగితే దేశంలో మళ్లీ అణగారిన కులాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అణచివేత తప్పదని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇండియా కూటమికే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని వర్గాల వారు ముందుకు వస్తున్నారని తెలిపారు. నాయకులు మిట్టపల్లి బాపు, రవీందర్, రాంబాబు, కుమార్ పాల్గొన్నారు.

జైపూర్: రాజ్యాంగ రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేష్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న రాజ్యాంగ రక్షణ ముగింపు సభకు తరలివెళ్తూ ఇందారంలో మాట్లాడారు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చి రాజరిక వ్యవస్థ తీసుకువస్తారని, రానున్న రోజుల్లో ఓటు అనే ఆయుధంతో బీజేపిని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించాలని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఐక్యంగా ఉండి రాజ్యాంగ రక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు. రవీందర్, బైరం లింగన్న, నరేష్, మల్లేష్‌పరమేష్ ఉన్నారు.

రిసెప్షన్‌లో దాడి : ఆరుగురికి గాయాలు

చెన్నూరు, ఏప్రిల్ 8 : చెన్నూరు పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీ (ఎనగుట్ట)లో ఆదివారం రాత్రి జరిగిన రిసెప్షన్‌లో గొడవ జరగగా ఇద్దరు యువకులు కత్తులతో దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సోమవారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే కాలనీకి చెందిన నెన్నెల గంగమ్మ (గంగు) కుమారుడి వివాహ రిసెప్షన్ జరుగుతుండగా వారి బంధువు ఆకుల సంజీవ్ అనే యువకుడు అక్కడకు వెళ్లి తన మేనకోడలు విందుకు హాజరైందని, ఆమె ఎక్కడ ఉందని బంధువులను ఆరా తీశాడు. అతని మేనకోడలు విందుకు వచ్చిన పాతర్ల కార్తీక్ అనే యువకుడితో మాట్లాడుతుండగా సంజీవ్ చూడడంతో గమనించిన కార్తీక్ అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో కోపోద్రిక్తుడైన సంజీవ్ అతని మిత్రుడు సమ్మయ్య అక్కడున్న వారితో గొడవకు దిగారు. కోడి పందేలకు కట్టే కత్తులతో కార్తీక్ గురించి అడగడంతోపాటు వరుడు కిరణ్, సుంకరి సింధు, నెన్నెల విజయ్, చింతకింది చరణ్, అట్టెం సుధీర్, చంద్రశేఖర్‌లపై దాడి చేశారు. నెన్నెల విజయ్, చింతకింది చరణ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో వారిని రాత్రి చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. వరుడి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు ఆకుల సంజీవ్, పందుల సమ్మయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

ఉపాధి హామీ పనులపై సమావేశం

వేమనపల్లి, ఏప్రిల్ 8: ఉపాధిహామీ పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్ అధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులను కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీవో బాపురావు, వెటర్నరీ డాక్టర్ అరుణ్, కమల్‌సింగ్, పాల్గొన్నారు.

నస్పూర్‌లో ఇఫ్తార్ బీఆర్ఎస్ విందు

నస్పూర్, మార్చి 8: బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ముస్లీం సోదరులకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, రఫీక్ ఖాన్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

మందమర్రిరూరల్, ఏప్రిల్ 8: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఎస్‌వో విజయలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం పొన్నారంలో అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అడవులతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో అడవుల్లో ఎండిన ఆకులు, చెట్లు ఉండడంతో ఎవరు కూడా నిప్పు రవ్వలు, బీడీలు, సిగరెట్‌లు అంటించి పడవేయవద్దని సూచించారు. బీట్ ఆఫీసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కన్నెపల్లి, ఏప్రిల్ 8: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. జన్కాపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్లారం వాగు వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 31,300 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చల్లబడిన వాతావరణం

జన్నారం, ఏప్రిల్ 8: దంచి కొడుతుండడంతో ఎండలతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఆదివారం రాత్రి మబ్బులు పట్టడం, సోమవారం చినుకులు పడడంతో వాతావరణం చల్లబడింది. దీంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎండ వేడి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందినట్లయ్యింది.

ఉగాది పూజలు


వాంకిడిలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 8: జిల్లాకేంద్రంలోని విశ్వబ్రాహ్మణులు శ్రీక్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉగాది సందర్భంగా సోమవారం నూతన సంవత్సరానికి ఘనస్వాగతం పలుకుతూ ఒకరోజు ముందునుంచే ప్రత్యేక పూజలుచేశారు. పుస్తకాలను,కులవృత్తుల పనిముట్లకుపూజలు నిర్వహించారు.

వాంకిడి:మండలంలోని ఖిరిడిఉన్నతపాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు ఉగాది వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాదిపచ్చడి పంపిణీ చేశారు.

రెబ్బెన: మండలంలోని రేకులగూడెంలో ముందుస్తు ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షడ్రూచులతో కూడిన పచ్చడిని విద్యార్థులకు అందజేశారు.

నేడు ఉగాది పంచాంగ శ్రవణం

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 8: కాగజ్‌నగర్ పట్టణంలోని రేణుకదేవి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం దేవాలయకమిటీ ఆధ్వర్యంలో ఉగాదిపండుగ పంచాంగశ్రవణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగజ్‌నగర్ గౌడసంఘం ఆధ్వర్యంలో మంగళవారం పంచాంగశ్రవణం నిర్వహిస్తున్నట్లు ఈకార్యక్రమానికి అందరూ తరలిరావాలనికమిటీ ప్రతినిధులు కోరారు.

చింతలమానేపల్లిలో కార్డన్ సెర్చ్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 8: మండలంలోని లంబాడీ హెట్టి, గుప్పుగూడెం గ్రామాల్లో సీఐ సాదిక్‌పాషా ఆధ్వ ర్యంలో సోమవారం ఎక్సైజ్, సీఆర్‌పీఎఫ్, టీఎస్ఎస్‌పీ సిబ్బంది కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రానున్న ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేసినట్లు సీఐ సాదిక్ పాషా, ఎస్సై నరేష్ తెలిపారు. ఈమేరకు గ్రామానికి చెందిన లావుడ్య తిరుపతి, ధరావత్ జగ్యానాయక్, అజ్మీరశివరాం, లావుడ్యబాటు, భుక్య తిరుపతివద్ద గుడుంబాలభించడంతో వారిపైకేసునమోదు చేసినట్లు తెలిపారు.

జైనూరులో పర్యటించిన మంత్రి సీతక్క


వైస్‌ఎంపీపీ రషీద్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

జైనూర్, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో మంత్రి సీతక్క ఆదివారం అర్ధరాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మైనార్టీ బీఆర్ఎస్ నాయకులు, మాజీ వైస్‌ఎంపీపీ షేక్ రషీద్, నాయకులు కాంబ్లే బాబా సాహేబ్, భుతాలె కిరణ్, కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్, మార్లవాయి మాజీ సర్పంచ్ కనకప్రతిభ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రిసీతక్క వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తుఫాన్ వచ్చిందన్నారు. దీంతో అనేక మంది బీఆర్ఎస్ నాయకులు తమపార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తుఫాన్ గాలిదెబ్బలో బీఆర్ఎస్, బీజేపీలు కొట్టుకొనిపోవడం ఖాయమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీమెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కాంగ్రెస్‌పార్టీ గెలుపుకోసం పనిచేసేవారికి రాబోయేరోజుల్లో తప్పకన్యాయం జరుగుతుందన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

జైనూర్, ఏప్రిల్ 8: వేసవి నేపథ్యంలో మారుమూల గ్రామాల్లో అధికారులు నీటిఎద్దడి నివారణకు చర్యలుతీసుకోవాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. మండలంలోని దుబ్బగూడ, శివనూర్ తదితర గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయాగ్రామాల్లో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యల్ని అడిగితెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేసేలా అధికారులు కృషిచేయాలన్నారు. అనంతరం జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ తదితర మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభుదయ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖలీల్, గ్రామ కార్యదర్శులు ప్రజలు పాల్గొన్నారు.


అధికారులు, ప్రజలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నిస్వార్థ సేవాపరుడు 'దేవర వినోద్'

● సమాజసేవలో ఆలయ అర్చకుడు


నంది అవార్డు తీసుకుంటున్న దేవర వినోద్(ఫైల్)

రెబ్బెన, ఏప్రిల్ 8: నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం రెబ్బెన మండల ఇందిరానగర్ శ్రీకనకదుర్గాదేవి ఆలయ అర్చకుడు దేవరవినోద్. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సేవా, ఆధ్యాత్మికరంగం నుంచి నంది పురస్కారం దేవర వినోద్‌కు లభించటంపై అంతా హర్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఈయన చేస్తున్న సేవలకు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వార్డు ఉత్తమ సేవా అవార్డు, శ్రీజ్ఞానసరస్వతి చారిటబుల్ ట్రస్టువారు కొవిడ్-19 అవార్డు, జైభీం ఫౌండేషన్‌వారు 2020అవార్డులను అందజేశారు. అలాగే 2023లో ఉత్తమ సేవాపురస్కార్ కూడా అందుకున్నారు.

చాలా సంతోషంగా ఉంది..- దేవర వినోద్

నాకు నంది అవార్డు రావటం చాలాసంతోషంగా ఉంది. పేదలకు నావంతుగా సహాయం అందిస్తున్నాను. ప్రతి ఆదివారం వచ్చే భక్తులకు ఉచిత అన్నదానం చేస్తున్నాను. అలాగే మండలంలో వివిధకార్యక్రమాలను చేపడుతు న్నాను.

తనిఖీల్లో నగదు పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 8: వాంకిడి మండలం ఇందాని ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.69వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర జివితికి చెందిన శేవలేచంద్రకాంత్ బొలేరోవాహనంలో ఆసిఫాబాద్ నుంచి జివితికి వెళ్తున్న క్రమంలో తనిఖీల్లో నగదు పట్టుబడిందన్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్‌చేసి ఎస్ఎస్‌టీ బృందంకు అప్పగించినట్లు తెలిపారు.


దహెగాం: మండలకేంద్రంలోని మైసమ్మ ఆలయ సమీపంలో వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం రూ.60వేల నగదుపట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకుండా నగదును తరలిస్తుండడంతో నగదును స్వాధీనపర్చుకొని ఎఫ్ఎస్‌టీ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు

సిర్పూర్(టి), ఏప్రిల్ 8: మండలకేంద్రంలోని ఈద్గా, మసీద్‌లు రంజాన్ పండుగకు ముస్తాబు అవుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద చదును చేస్తున్నారు. పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగింపు తదితర పనులు చేస్తున్నారు. పనులను ఎంపీవో కృష్ణమూర్తి, నాయకులు ఇష్తుస్సేన్ తదితరులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెజ్జూరు, ఏప్రిల్ 8: బెజ్జూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సలుగుపల్లి ఫీడర్ పరిధిలోని మర్తిడి, సలుగుపల్లి, కుకుడ, అంబగట్ తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అంజన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ మరమ్మతుల సందర్భంగా విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.




రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 8: జిల్లాలో వేసవి కాలానికి సంబంధించి మద్దతు ధర చెల్లించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ సబా వత్ మోతిలాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఫిర్యాదులు, వివరాలకు కంట్రోల్ రూమ్ నెంబర్ 63039 28682లో సంప్రదించాలన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 8 : బెల్లంపల్లిలో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కలు ఈ నెల 12న పర్యటిస్తారని, మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. నాయకులు నర్సింగరావు, సంతోష్, హరీష్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో కొత్త ఏడాదిలోకి..



నస్పూర్, ఏప్రిల్ 8: సంస్కృతి సంప్రదాయాల విశిష్ట కలిగిన పండుగ ఉగాది. ఉగాది పర్వదినం నుంచే తెలుగు సంవత్స రం ప్రారంభమవుతుంది. ప్రకృతిలో కొత్త చిగుళ్ళతో వృక్షాలు ఆకుపచ్చని శోభతో లేత మామిళ్ళు, వేప పూతల పరిమళాలు, ఫల పుష్ప వృక్షాల గుభాళింపులతో, ప్రకృతి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, నవ సౌరభాలను మోసుకువస్తోంది. త్రిమూర్తులు సృష్టి, స్థితి, లయ కారకులు. మంగళవారం చైత్ర శుద్ధ పాడ్యమినాడు శ్రీక్రోధి నామ సంవత్సరం ప్రారంభ మవుతుంది. జిల్లాలో ఉగాది పర్వదినాన్ని నిర్వహించడానికి ప్రజలు సిద్ధమయ్యారు. పంచాంగ శ్రవణం వినడానికి ప్రజలు ఆలయాలకు వెళతారు.

● **పచ్చడి షడ్రుచుల సమ్మేళనం..:** ఉగాది, సంక్రాంతి, రథ సప్తమిలు కాలానుగుణంగా వస్తాయి. మారుతున్న కాలంతోపాటు మనుషుల శరీర మానసిక స్థితిగతుల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. శిశిరం నుంచి వసంత రుతువులోకి కాలం మారే సమయంలో రోగాల వ్యాప్తి జరుగుతుంది. వాటిని ని యంత్రించడమే ఉగాది పరమా ర్థం. ఆరు రుచులు తీపి, పులు పు, కారం, ఉప్పు, వేప వగరు, చేదులను రంగరిం చిన పచ్చడి రుతుమార్పులకు అనుగుణంగా వచ్చే వాత, పిత్త దోషాలను హరించే ఔషధంగా పని చే స్తోంది. ఉగాది పచ్చడి తయారీకి చెరుకు, మామిడికాయలు, వేపపువ్వులు, చింతపండు, ఉప్పు, మిరపకాయలు, బెల్లంతో తయారు చేస్తారు. ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం జరప డం ఆనవాయితీగా వస్తోంది. ఆ సంవత్సరంలో మంచి చెడులు, ఆదాయ ఫలాలు, తమ జీవిత క్ర మాలను తెలుసుకోవడానికి ఇష్టపడుతారు. ఏడా ది పొడవున మంచి చెడ్డలను, కష్ట సుఖాలను సం యమనంతో స్వీకరించాలని ఉగాది పచ్చడి షడ్రు చుల సమ్మేళనం తెలియజేస్తోంది. రైతులు వ్యవ సాయ పనులకు కూడా శ్రీకారం చుడుతారు.

● **గుమ్మాల అలంకరణలు...:** శిశిర రుతువు ఆకురాలు కాలం, అనంతరం వచ్చే వసంత కాలంలో చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా కనిపిస్తోంది. తెలుగు వారి మొదటి పండగ ఉగాది నుంచి మొదలవుతుంది. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలను కట్టి అలంకరిస్తారు. ఉగాది రోజున ఉదయమే తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి దైవారాధన చేసి షడ్రుచులు వేప ప్రసాదాన్ని దైవానికి సమర్పించి స్వీకరించాలి. ఉగాది రోజు న బ్రహ్మను, గణపతిని, నవగ్రహాలను పూజిస్తారు.

ముందస్తు ఉగాది సంబరాలు

కోటపల్లి: బావనపల్లి ప్రాథమిక పాఠశాల, మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం ముందస్తుగా ఉగాది సంబరాలను నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, పాఠశాల హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న పాల్గొన్నారు.

వారంటీ లేని గ్యారంటీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

ఏసీసీ, ఏప్రిల్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలకు వారంటీ లేదని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మాట్లాడారు. తాగునీరు లేక మహిళలు చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసానికి, ద్రోహానికి ప్రతీక అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్పించే పనిలో ఉన్నాడని, నాలుగు నెలల కాలంలో హామీలు నిలబెట్టుకునే పనిచేయలేదని విమర్శించారు. రైతు భరోసా రూ.15 వేలకు పెంపు, ప్రతీ మహిళకు రూ.2,500, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. బాలింతలకు ఇచ్చిన కేసీఆర్ కిట్‌లు ఇవ్వడం లేదని, న్యూట్రిషన్ కిట్‌లు, కల్యాణలక్ష్మీ, రైతు రుణమాఫీ, రైతు కూలీలకు రూ.12 వేలు అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు దొంగ అని చిల్లర బుద్ధితో మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ బలహీన పడిందని అనడం సిగ్గుమాలిన చర్య అని, కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు దొరక్క బీఆర్ఎస్ నాయకులను చేర్చుకుని టికెట్లు ఇస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ అని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షల వడ్డీ లేని రుణం, కార్మికుల ఆదాయ పన్ను మినహాయింపు, నియోజకవర్గంలో 5 ఏండ్లలో 45 వేల ఉద్యోగాలు కల్పిస్తామని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. భూగర్భ కార్మికుడు కొప్పుల ఈశ్వర్, ఆగర్భ ధనవంతుడు గడ్డం వంశీల మధ్య పోటీ నడుస్తుందని ప్రజలు కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. విజిత్‌రావు, రాజారమేష్, సందెల వెంకటేష్ పాల్గొన్నారు.

నీటి సమస్యలపై కంట్రోల్ రూం ఏర్పాటు

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 8: రామకృష్ణాపూర్ పట్టణ పరిధిలో నీటి సరఫరాలో సమస్యలు, లీకేజీలు ఉంటే క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ వసంత్ (83099 360731), వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ (8074138866), వాటర్ సప్లయి సూపర్‌వైజర్ నారాయణ (9391640311) నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ చిట్యాల సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్‌లైన్ నంబర్లు ప్రశాంత్- 9553331187, హబీబ్ - 9550357732లకు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలో మంచినీటి సరఫరాలో సమస్యలుంటే మున్సి పల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో సంప్రదించా లని కమిషనర్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూం నెంబర్ 08735-222159లో లేదా వాటర్ సప్లయి సూపర్ వైజర్ 8885149953లో సంప్రదించాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

జన్నారం, ఏప్రిల్ 8 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం లింగయ్యపల్లిలో పర్యటించి వర్మీకంపోస్టు, డ్రైనేజీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీలను రోజు శుభ్రం చేయాలని సూచించారు. తడిపొడి చెత్తను వేరు చేసి డంపింగ్‌యార్డు తరలించి ఎరువులను తయారు చేయాలన్నారు. ఎండల తీవ్రంగా ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవనిహెచ్చరించారు.

నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

నస్పూర్, మార్చి 8 : నస్పూర్ శివారు సర్వే నంబరు 64లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ చిట్యాల సతీష్‌లు అడ్డుకున్నారు. దరఖాస్తు చేసినప్పటికి అనుమతి రాకుండానే నిర్మాణం చేస్తున్నారని వారు తెలిపారు. గిర్దావర్ మాంతయ్య, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

ఏసీసీ, ఏప్రిల్ 8:ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మెయిన్ పైపులైన్ మరమ్మతు చేపడుతున్నందున బుధవారం మంచిర్యాల పట్టణానికి నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



రంజాన్ వేళలు	
ఇఫ్తార్ మంగళవారం	6:33
సహర్ బుధవారం	4:40